



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ



ఉత్కంఠ

రిజర్వేషన్‌ల కోసం ఎదురుచూపులు **ఊగిసలాటలో ఆశావహులు**

ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు వస్తున్న నేపథ్యంలో ఆ దిశగా ఆశావహులు అడుగులేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ ప్రచారానికి సిద్ధమవుతున్నారు. అయితే పాత రిజర్వేషన్లే ఉంటాయా.. కొత్త రిజర్వేషన్ల ప్రకారం నిర్వహిస్తారా అనే విషయంపై మీమాంస నెలకొన్నది. అందుకే ఎంపీటీసీ నుంచి జడ్పీ చైర్మన్ రిజర్వేషన్ దాకా ఉత్కంఠ తప్పడం లేదు. రిజర్వేషన్లు అటుఇటైతే పెట్టుబడి ఆగమవుతుందని ఆశావహులు ఊగిసలాటలో ఉన్నారు.

- ఎంపీటీసీ నుంచి జడ్పీచైర్మన్ దాకా రాని స్పష్టత
- స్థానిక ఎన్నికల దిశగా సంకేతాలు
- పోటీలో ఉంటామంటూ మొదలైన ప్రచారం
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కొత్తగా మూడు మండల పరిషత్‌లు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 28 : సంగారెడ్డి జిల్లాలోని 26 మండలాల్లో 271 ఎంపీటీసీ స్థానాలు, 26 జడ్పీటీసీ స్థానాలు, 631 గ్రామపంచాయతీలు ఉండగా మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో 190 ఎంపీటీసీ, 21 జడ్పీటీసీ స్థానాలు, 492 పంచాయతీలు ఉన్నాయి. గతేడాది మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్‌ల పదవీకాలం ముగిసింది. కాగా, 2024 ఫిబ్రవరిలోనే సర్పంచ్‌లు, వార్డు సభ్యుల గడువు పూర్తయ్యింది. ఈ రెండు ఎన్నికలను నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సెప్టెంబరు 30వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియను ముగించాలని ఇటీవల హైకోర్టు సూచనలు చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు అడుగులు పడుతున్నాయి. అయితే, ముందు

మిగతా 8వ పేజీలో

మెదక్ జిల్లా

మండలం	పంచాయతీలు	ఎంపీటీసీలు
అల్లాదుర్గం	16	09
చేగుంట	25	12
చిలప్‌చెడ్	19	06
హవేళిఘన్‌పూర్	30	12
కౌడిపల్లి	35	10
కొల్చారం	21	10
మెదక్	21	07
మనోహరాబాద్	17	07
మాసాయిపేట	13	05
నర్సాపూర్	35	10
నార్సింగి	09	05
నిజాంపేట	16	08
పాపన్నపేట	40	15
రామాయంపేట	16	07
రేగోడు	18	07
పెద్దశంకరంపేట	27	12
చిన్నశంకరంపేట	31	12
శివ్వంపేట	37	12
టేక్మాల్	29	10
తూప్రాన్	14	05
వెల్దుర్తి	23	09
మొత్తం	492	190

సంగారెడ్డి జిల్లా

మండలం	పంచాయతీలు	ఎంపీటీసీలు
అందోల్	25	11
చౌటకూర్	15	06
గుమ్మడిదల	08	05
హత్నూర	38	16
ఝరాసంఘం	33	13
జిన్నారం	10	05
కల్హేర్	15	06
కంది	22	14
కంగ్టి	33	12
కోహీర్	23	13
కొండాపూర్	24	12
మనూరు	22	08
మొగుడంపల్లి	22	11
మునిపల్లి	30	12
నాగల్‌గిద్ద	33	09
నారాయణఖేడ్	47	15
నిజాంపేట	18	06
న్యాల్‌కల్	38	15
పటాన్‌చెరు	11	10
పుల్కల్	19	09
రాయికోడ్	32	12
సదాశివపేట	30	14
సంగారెడ్డి	11	07
సిర్గాపూర్	28	08
వట్‌పల్లి	22	09
జహీరాబాద్	22	13
మొత్తం	631	271

ప్రశ్నార్థకంగా పటాన్‌చెరు

పటాన్‌చెరు పట్టణం జీహెచ్ఎంసీ పరిధిలో ఉండగా మండలంలోని గ్రామాలు పటాన్‌చెరు మండల పరిషత్‌లో ఇన్నాళ్లు కొనసాగాయి. ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల ఏర్పాటుతో మండలంలోని గ్రామాలన్నీ విలీనమయ్యాయి. దీనికి సంబంధించి గెజిట్ కూడా విడుదలైంది. దీంతో మండల పరిషత్ వ్యవస్థ రద్దవుతుందని భావించారు. అయితే పటాన్‌చెరు మండలంలో 11 గ్రామాలు, 10 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లుగా అధికారుల రికార్డుల్లో నమోదై ఉంది. ఇక జిన్నారం మండలంలో ఇప్పటికే ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీ ఉంది. తాజాగా జిన్నారంతోపాటు గడ్డపోతారం మున్సిపాలిటీలను ఏర్పాటు చేసి గ్రామాలన్నీ విలీనం చేసి కేబినెట్‌లోనూ తీర్మానం చేశారు. కానీ జిన్నారం మండలంలో 10 గ్రామపంచాయతీలు, 5 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లుగా చూపిస్తున్నాయి. దీంతో ఆశావహులు అయోమయంలో పడ్డారు. ఎట్టకేలకు సోమవారం జిన్నారం మున్సిపాలిటీ గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేయడంతో దీనిపై సందిగ్ధం వీడింది. ఇక పటాన్‌చెరు మండలంపైనే స్పష్టత రావాల్సి ఉన్నది.

గుజరాత్ రాష్ట్రం నుంచి బ్యాలెట్ బాక్సులు

మెదక్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గుజరాత్ రాష్ట్రం నుంచి బ్యాలెట్ బాక్సులను తెప్పించనున్నారు. స్థానిక ఎన్నికలను రెండుదశల్లో నిర్వహించడానికి పంచాయతీరాజ్‌శాఖ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనల చేయగా, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జడ్పీ సీఈవో ఎల్లయ్య ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 2,400 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. అదనంగా మరో 1100 బ్యాలెట్ బాక్సులను గుజరాత్ నుంచి తెప్పించనున్నారు.



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

'కస్తూర్బా'లో కలెక్టర్ బస

విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేసిన ప్రావీణ్య

హత్నూర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హత్నూర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సోమవారం రాత్రి బస చేశారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. విద్యాలయంలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేసి ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సీఎస్ఆర్ నిధులతో అన్ని వసతులు కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భవనం మరమ్మతులు, నీటి వసతి, కరెంటు వంటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. అంతకు ముందు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారులకు శ్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేసేలా చూడాలని సూచించారు. ఆమె వెంట డీఈవో వెంకటేశ్వర్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జయలక్ష్మి, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, మండల ప్రత్యేక అధికారి స్వప్న, ఎంపీడీవో శంకర్, ఎంఈవో వెంకటనర్సింలు, ఎంపీవో యూసుఫ్, ఏపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఇంటింటి ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలి
- ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



దన్నూర గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్ జూలై 28(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గత సంవత్సరం డెంగీ, మలేరియా కేసులు ఎక్కడ ఎక్కువ నమోదయ్యాయో ఆ ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఎల్లకుర్తి, శేరిపల్లి, దన్నూర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉన్న గుంతలు, కుండీల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రతలు తీసుకోవాని సూచించారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేను పాటించాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిల్లో మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేయాలని, ఇంటింటి ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, పేదల సొంతింటి కల సాకారం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతిని సాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రియాజోద్దీన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్‌గా ఉమాహారతి బాధ్యతల స్వీకరణ

నారాయణఖేడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సబ్‌కలెక్టర్‌గా నియామకమైన ఎస్.ఉమాహారతి ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న అశోకచక్రవర్తి నుంచి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు ఆర్డీవో అశోకచక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, తహసీల్దార్ హసీనాబేగం, రెవెన్యూ అధికారులు ఆమెను సన్మానించారు.

సమస్యలపై ప్రజలు నేరుగా సంప్రదించాలి

● సబ్‌కలెక్టర్ ఎన్.ఉమాహారతి

ఇంటర్వ్యూ



నారాయణఖేడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 12 రెవెన్యూ డివిజన్లను సబ్‌కలెక్టర్ల స్థాయికి అప్‌గ్రేడ్ చేయగా, ఇటీవల ఆరు రెవెన్యూ డివిజన్లకు ఐఏఎస్ అధికారులను నియమించారు. ఈ మేరకు ఖేడ్ సబ్‌కలెక్టర్‌గా నియామకమైన ఎన్.ఉమాహారతి సోమవారం బాధ్యతలు చేపట్టగా ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు నేరుగా సంప్రదించాలని సూచించారు.

మీ కుటుంబ నేపథ్యం? సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంపై మీ స్పందన?

నా సొంత జిల్లా నల్గొండ. తండ్రి ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. నేను ఐఏఎస్‌గా ఎంపిక కాగా, తమ్ముడు ఐఈఎస్ చదువుతున్నారు. ఐఏఎస్ పూర్తి చేసుకున్నాక వికారాబాద్ జిల్లాలో ఇండిపెండెంట్ చార్జితో విధులు నిర్వహించాను. ఆ ప్రాంతం కూడా వెనుకబడిన ప్రాంతం. అక్కడ పని చేసినందున నారాయణఖేడ్ లాంటి ప్రాంతంలో మొదటి బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉంది.

ఖేడ్ ప్రాంత అభివృద్ధికి ఏ చర్యలు తీసుకుంటారు ?

నేను సబ్‌కలెక్టర్‌గా ఈరోజే బాధ్యతలు స్వీకరించాను. ఈ ప్రాంత స్థితిగతులను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేస్తా. విద్యపై దృష్టి సారిస్తా. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విద్యాభివృద్ధి ప్రధానం. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతను ఇవ్వడమే కాకుండా ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న వలసల నివారణకు కృషి చేస్తా.

ప్రజలకు సమస్యల పరిష్కారం కోసం మీరిచ్చే సూచన

సమస్యలు ఉన్న వారు నేరుగా నన్ను సంప్రదించి ఫిర్యాదు చేస్తే, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా. ఖేడ్ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని వర్గాల వారు సహకరించాలి.

సిగాచి బాధితుల రోదన

- రూ.కోటి పరిహారం ఎక్కడంటూ నిలదీత
- నెలరోజుల నుంచి చెప్పులరిగేలా తిరుగుతున్నామని ఆవేదన
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో వద్ద మృతుల కుటుంబాల ఆందోళన

సంగారెడ్డి క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సిగాచి ఘటన జరిగి నెల రోజులు కాగా, ప్రభుత్వం తమకు ఇస్తానన్న పరిహారం ఇంకా అందలేదని కొందరు బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. వీరికి మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్ తదితరులు మద్దతుగా సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సిగాచి బాధిత కుటుంబసభ్యులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిగాచి బాధితులు విలేకరులతో మాట్లాడారు. నాటి ప్రమాదాన్ని గుర్తు చేసుకుంటూ బాధిత కుటుంబీకులు కన్నీరు పెట్టాయి. పరిహారం కోసం కంపెనీ చుట్టూ, అధికారుల తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఏ ఒక్కరికీ రూ.కోటి పరిహారం ఇంకా అందలేదని వాపోయారు. కేవలం రూ.15లక్షలు, రూ.10లక్షలు మాత్రమే ఇచ్చారని, మరి కొంత మంది బాధితులకు ఖర్చుల కింద రూ.30 వేలు మాత్రమే అందజేశారు వాపోయారు. తమ వారు చనిపోయినా డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు. పంచనామా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో కనీసం ఇన్సూరెన్స్ పొందలేకపోతున్నామని అన్నారు. ఘటన

మిగతా 6వ పేజీలో

ఒక్క రూపాయి రాలేదు



సిగాచి ప్రమాదంలో నా సోదరుడు ఇర్ఫాన్ అన్సారీ మృతి చెందాడు. పరిహారం కింద ఇప్పటివరకు ఒక్క రూపాయి రాలేదు. జార్ఖండ్ నుంచి ఇక్కడికి రావడానికి విమాన టిక్కెట్‌కు రూ.30వేలు ఖర్చయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటిలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కంపెనీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

-సోహెల్ అన్సారీ, మృతుడు ఇర్ఫాన్ అన్సారీ సోదరుడు), జార్ఖండ్



మృతుల కుటుంబాల ఆందోళనలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, పటాన్‌చెరు నాయకులు తదితరులు



- ప్రొవిజినల్ జాబితాలకే పరిమితమైన వైద్య శాఖ
- 117 పోస్టుల భర్తీకి ఏప్రిల్‌లో నోటిఫికేషన్
- రోస్టర్, వేకెన్సీ ప్రాంతాలపై అంతా గోప్యత
- నియామకాలపై కొత్త కలెక్టర్ దృష్టి సారించేనా?

మెరిట్ జాబితా ఏదీ?

సంగారెడ్డి అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి ఆ శాఖ అధికారులు ఏప్రిల్ 29న నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు వివిధ విభాగాల్లో పనిచేసేందుకు ఖాళీగా ఉన్న 117 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించి, మే 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో 3,110 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత పలు విడతల వారీగా ప్రొవిజినల్ జాబితా ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించారు. ప్రొవిజినల్ జాబితాలు వెల్లడించి నెల రోజులపైన గడుస్తున్నా.. ఇప్పటి వరకు మెరిట్ జాబితా ప్రకటించలేదు. దీంతో దరఖాస్తుదారులు జాబితా కోసం ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తుదారుల్లో ఆందోళన

ఆరోగ్య శాఖలో 117 పోస్టుల భర్తీలో భాగంగా రోస్టర్, వేకెన్సీ ప్రాంతాలను ఆ శాఖ ప్రదర్శించాల్సి ఉన్నా ఇప్పటివరకు ఆ ఊసే లేదు. గతంలోనూ రోస్టర్, వేకెన్సీ స్థానాలను ప్రదర్శించకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. కొత్త కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి రోస్టర్, వేకెన్సీల ప్రదర్శనకు ఆ శాఖ అధికారులను ఆదేశించాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు. నియామకాల పూర్తికి కలెక్టర్, నూతన డీఎంహెచ్‌వో చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జాప్యంపై అనుమానాలు

గతేడాది 97 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా, ఏడాదైనా నియామకాలు చేపట్టలేదు. దీంతో పాత నోటిఫికేషన్ పక్కన పెట్టి ఈ ఏడాది ఏప్రిల్‌లో మళ్లీ కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ప్రొవిజినల్ జాబితాకే పరిమతమైంది. మెరిట్ జాబితా ప్రదర్శనలో జాప్యం జరగడం పట్ల పలు అనుమానాలకు తావిస్తున్నది. పైరవీలు, సిఫారసుల ఒత్తిడితో జాప్యం చేస్తున్నట్టు తెలిసింది.

నిండు గర్భిణికి ఎంత శోకం

● చేపలు పట్టేందుకు వెళ్లిన భర్త నీట మునిగి మృతి



ప్రవీణ్ మృతదేహం, రోదిస్తున్న భార్య లలిత

తూప్రాన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల్లో ప్రసవం.. అంతలోనే భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో భార్య గుండెలవిసేలా రోదించింది. అయ్యో దేవుడా ఎందుకీ శిక్ష అంటూ బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. చెరువులో చేపలు పట్టే క్రమంలో ప్రమాదశవాత్తు వ్యక్తి నీట మునిగి మృతిచెందిన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన టంటం ప్రవీణ్ (25), లలిత దంపతులకు నాలుగేళ్ల అశ్విన్, ఏడాదిన్నర కూతురు అమ్ములు సంతానం. ప్రస్తుతం లలిత నిండు చూలాల గర్భిణి కాగా, ఆగస్టు 1న ప్రసవం జరగనుందని వైద్యులు తెలిపారు. జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం కటుంబంతో కలిసి తూప్రాన్ పట్టణానికి వచ్చి పోతరాజుపల్లిలోని గీతారెడ్డి కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. సోమవారం పనులు లేకపోవడంతో అల్లాపూర్ శివారులోని తిమ్మాయి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో జారి చెరువులో పడిపోయాడు. పక్కనే ఉన్న బండరాయిని పట్టుకొని మరో ప్రయత్నం చేసినప్పటికీ మళ్లీ జారి చెరువులో పడి గల్లంతయ్యాడు. అక్కడే చేపలు పడుతున్న మరో వ్యక్తి సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ గొడవల్లో అత్తను చంపిన అల్లుళ్లు



కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

మద్దూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో తలెత్తిన గొడవల కారణంగా అల్లుళ్లు అత్తను నరికి చంపారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజర గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బంజర గ్రామానికి చెందిన జంగిలి యాదగిరి వజ్రమ్మ దంపతుల కూతురు భవానీని ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల కనకయ్య కుమారుడు మహేష్‌కు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరు అమీన్‌పూర్‌లో అత్తామామలతో కలిసి ఉంటుంన్నారు. మహేష్, భవానీలకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొద్ది సంవత్సరాల నుంచి మహేష్ భవానీల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మహేష్‌పై మద్దూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్మారంలో పెద్ద మనుషుల మధ్య మాట్లాడుకుని కేసు విషయంలో కాంప్రమైజ్ అయ్యారు. యాదగిరి, వజ్రమ్మలు తమ కూతురును భర్తతో పంపించకుండా బంజరకు తీసుకెళ్లారు. ఆదివారం వారిద్దరు తమ కుమార్తెతో పాటు మనుమరాండ్లను, మనుమడిని ధర్మారంలోని అత్తగారి ఇంటికి తీసుకువచ్చారు. అల్లుడు ఇంటి దగ్గర లేకపోవడంతో అల్లుడు వచ్చే వరకు ఉండమని భార్య వజ్రమ్మకు చెప్పి భర్త యాదగిరి బంజరకు వచ్చారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న మహేష్ 'ఇక్కడ ఎందుకున్నావ్.. వెళ్లిపో' అంటూ వెళ్లగొట్టాడు. దీంతో వజ్రమ్మ బంజరకు చేరుకుంది. అంతకు ముందే మహేష్ ఫోన్ చేసి మామ దగ్గర నుంచి ఇంటి తాళం చెవి తీసుకున్నాడు. విషయాన్ని యాదగిరి భార్యకు చెప్పగా, ఇంట్లో వస్తువులు పోతే ఎలా అని ప్రశ్నించింది. ఈ విషయం తెలిసి ఆగ్రహంతో ఊగిపోయిన మహేష్ తన తమ్ముడు హరీష్‌తో కలిసి మధ్యాహ్నం అత్తగారి గ్రామమైన బంజరకు చేరుకున్నారు. వజ్రమ్మ.. జంగిలి మల్లేష్ ఇంటి వద్ద ఉండగా, తాళం చెవి ఇచ్చేందుకు వచ్చానంటూ అత్తతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో హరీష్ వజ్రమ్మను గట్టిగా పట్టుకోగా, మహేష్ వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెను నరికి చంపి ఇరువురు పరారయ్యారు. అక్కడే ఉన్న వారు అరుస్తూ పరుగులు పెట్టరు. తర్వాత వచ్చి చూడగా వజ్రమ్మ రక్తం మడుగులో పడి ఉంది. గ్రామస్థులు మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ అలీ సిబ్బందితో వచ్చి, అక్కడి నుంచి గ్రామస్థులను పంపించారు. ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా ధర్మారంతో పాటు బంజరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అంతకు ముందు సంఘటనా స్థలాన్ని హుస్నాబాద్ సీఐ కొండ శ్రీను, చేర్యాల ఎస్సై నవీన్, కొమురవెల్లి ఎస్సై రాజు పరిశీలించారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



నర్సాపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ లింగంకు ఫిర్యాదు ఇచ్చిన సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన స్థాయి మరిచి సీఎంపై అనుచిత వాఖ్యలు చేశాడని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా తన సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పట్టించుకోకుండా తన రాజకీయ పబ్బం కోసం అనవసరపు రాద్దాంతం చేస్తున్నాడన్నారు. సీఎంపై ఇష్టానుసారంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోలీసులను కోరారు.

కేసీఆర్ గడిలో.. రేవంత్ బంగ్లాలో పుట్టాడు

● నాకు పేదల బాధలు తెలుసు... దివ్యాంగుల పెన్షన్ పెంచాలి
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



దివ్యాంగురాలిని ట్రై సైకిల్‌పై సభాస్థలికి తీసుకువస్తున్న మందకృష్ణ

మెదక్ కల్చరల్/సంగారెడ్డి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ గడిలో, రేవంత్‌రెడ్డి బంగ్లాలో పుట్టాడని, నేను పేదరికంలో పుట్టానని, అందుకే పేదల సమస్యలపై పోరాడుతున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడే రూ. 200 పింఛన్లపై పోరాడి రూ.500 పింఛన్ సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కిందన్నారు. ఎమ్మార్పీఎస్ పేదలకోసం ఎప్పుడైతే రోడ్డు పైకి వస్తుందో అప్పుడే పింఛన్‌లు పెరుగుతున్నాయని, అందుకోసమే మళ్లీ ఒక్క సారి మీ కోసం ముందుకు వచ్చానన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో దివ్యాంగుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్ పెంచుతుతామని చెప్పి మాట ఇచ్చి నేటికి అమలు చేయలేదన్నారు. ఏపీలో అక్కడి సీఎం చంద్రబాబును కలిసి పెన్షన్ పెంచాలని కోరితే, కండర క్షీణత ఉన్నవారికీ కలిపి పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం పెంచి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పెన్షన్లు పెంచి ఇవ్వకపోవడంతో ఒక్కో దివ్యాంగుడు రూ. 40 వేలు నష్టపోయారని అన్నారు. దివ్యాంగుల నిధులను రైతు రుణమాఫీకి ఖర్చు చేశారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బీఆర్ఎస్ మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జిల్లా ఇన్‌చార్జి దండు శంకర్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాచుపల్లి పాండు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి కుమార్, నంది గల భూమయ్య, డీలర్ యాదగిరి లక్ష్మీనరసమ్మ, శ్రీనివాస్ సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు అస్తరుగల్ల బాలరాజు, బొజ్జ సైదులు, బంజూరు విజయ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లు ఇస్తవా.. రాజినామ చేస్తవా

మహిళలకు ఆగస్టు 11 వరకు పింఛన్‌లు ఇస్తవా.. రాజీనామా చేసి వెళ్లిపోతావా సీఎం రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలని మంద కృష్ణమాదిగ అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన మహాగర్జన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వచ్చే రూ. 2వేల పింఛన్‌లు కూడా సక్రమంగా వేయకుండా మహిళలను వంచించారని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ విషయంలో కూడా రేవంత్‌రెడ్డి మాట మార్చి ఆ నెపాన్ని కేంద్రంపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాయిబాజ్ మృతదేహం లభ్యం

పాపన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మిత్రులతో కలసి చేపల వేటకు వెళ్లిన బాచారం గ్రామానికి చెందిన శాయిబాజ్ ఆదివారం ముద్దాపూర్ బ్రిడ్జి కింద గల్లంతయ్యాడు. అతని తండ్రి గౌస్ పాషా ఫిర్యాదు మేరకు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తన బృందాలతో కలిసి వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు తమ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం మృతదేహం లభించింది. శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తన కొడుకు మృతికి సంబంధించి అతని మిత్రులపై అనుమానం ఉందని తండ్రి తెలిపారు.

ఆవులకు మత్తు మందు.. పోలీసులకు ఫిర్యాదు

సదాశివపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మేత మేసేందుకు వెళ్లిన ఆవులకు గుర్తుతెలియని వ్యక్తులు మత్తు ఇంజక్షన్ చేసి ఆవులను దొంగిలించడానికి యత్నించారని పట్టణానికి చెందిన శంకర్, కిష్టయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటాపూర్ గ్రామ శివారులో మేత మేసేందుకు వెళ్లిన తమ ఆవులకు గుర్తుతెలియని వ్యక్తులు మత్తు ఇంజక్షన్ చేయడంతో ఆవులు స్పృహ కోల్పోయి పడి ఉన్నాయన్నారు. స్థానికులు గమనించి ఆవులను కాపాడటంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంటి ఎదుట నిలిపిన బైకులకు నిప్పు

నారాయణఖేడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు బైకులకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున నిప్పుపెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. దత్తాత్రేయ కాలనీలో రాథోడ్ సురేష్, మోహన్ చౌహాన్ ప్రతిరోజు లాగే ఆదివారం రాత్రి తమ బైకులను ఇళ్ల ఎదుట ఉంచి నిద్రపోయారు. మధ్యరాత్రి వీరి బైకుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ తీసి వాటిపై చల్లి నిప్పంటించారు. శబ్దం రావడంతో యజమానులు బయటికి వచ్చి చూసేసరికి బైకులు దగ్ధమై ఉన్నాయి. సమీపంలోనే మధుకు చెందిన బైకును కూడా దగ్ధం చేయడానికి యత్నించినప్పటికీ, అందులో పెట్రోల్ లేకపోవడంతో పొదల్లోకి తోసి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● ఒకరి దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు



కర్రె జశ్వంత్ (ఫైల్)

చిన్నశంకరంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన కర్రె జశ్వంత్, మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన మత్తడి రమేష్, రుద్రారం గ్రామానికి చెందిన చాకలి రాములు మెదక్‌లో ఒక కార్యక్రమానికి వెళ్లి, ఎర్టిగా కారులో ఇంటికి తిరిగి ప్రయాణిస్తున్నారు. చిన్నశంకరంపేట వద్ద అతివేగంతో వస్తున్న కారు అదుపుతప్పి మెదక్-చేగుంట రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో జశ్వంత్ (18) అక్కడికక్కడే మృతి చెందాడు. మత్తడి రమేష్, చాకలి రాములుకు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం స్థానికుల సహాయంతో 108 అంబులెన్సులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి జశ్వంత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిత్తూరులో చేర్యాల యువకుడి దుర్మరణం



బొడ్డు భరత్ (ఫైల్)

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వరుడి దర్శనం కోసం వెళుతూ చేర్యాల పట్టణానికి చెందిన బొడ్డు భరత్ (20) చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే, పట్టణానికి చెందిన భరత్ హైదరాబాద్‌లో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. తోటి మిత్రులతో కలిసి రెండు రోజుల క్రితం కారులో తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. ముందుగా అన్నవరం, తమిళనాడు రాష్ట్రంలోని గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి తిరుమలకు పయనమయ్యారు. చిత్తూరు జిల్లా శివారులో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో భరత్ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, మిగతావారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతున్నారు. భరత్ మరణవార్త విని తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని తీసుకురావడానికి వారు బయలుదేరి వెళ్లారు.

టిప్పర్ ఢీకొన్ని వాచ్‌మన్..

పటాన్‌చెరు జూలై 28 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ ఢీకొని ఓ వాచ్‌మెన్ దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం బచ్చుగూడ గ్రామానికి చెందిన రామిరెడ్డి (54) జీఎంఆర్ మకుట అనే సంస్థలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం డ్యూటీకి వెళ్తున్నానంటూ మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఇన్నోవా కారు ఎడమవైపు ఢీకొట్టింది. అదే సమయంలో కుడి వైపు నుంచి ఇంద్రేశం నుంచి పటాన్‌చెరు వెళ్తున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలయిన రామిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు..



జగన్నాథం (ఫైల్)

హవేళిఘనపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒక కౌలు రైతు మృతి చెందిన సంఘటన వాడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి: గ్రామానికి చెందిన ఆకుల జగన్నాథం (50) తన భూమితోపాటు ఇతరుల నుంచి రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం తన కొడుకు శివతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. శివ పొలంలో నీళ్లు చూస్తుండగా, జగన్నాథం బోరుమోటారు నడవకపోవడంతో స్టార్టర్‌లో మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఒడ్డుపై నుంచి జారిపడి యువరైతు..



జగన్నాథం (ఫైల్)

మిరుదొడ్డి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఒడ్డుపై నుంచి జారిపడి యువ రైతు మృతి చెందిన సంఘటన సోమవారం మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సమత తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన చెక్క భిక్షపతి (38) వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఒడ్డుపై నుంచి నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బురదలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప రైతులు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య బాలలక్ష్మి, ముగ్గురు పిల్లలున్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన మల్లేశం

గజ్వేల్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతో క్రిమి సంహారక మందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్‌కు చెందిన శ్రీరామ్ మల్లేశం(59) గజ్వేల్‌లోని లక్ష్మిప్రసన్న కాలనీలో భూమి విషయంలో పక్కన ఉన్నవారితో రెండు నెలల నుండి గొడవలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్తాపం చెంది సోమవారం గజ్వేల్ పట్టణంలోని సాయిబాబ దేవాలయం వద్ద క్రిమిసంహారక ముందు సేవించి పడిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సాచారం ఇవ్వగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మల్లేశంని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

చిలప్‌చెడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాము కాటు వేయడంతో ఒక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలం పరిధిలోని చండూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చండూరు గ్రామానికి చెందిన ఊట్ల సత్తెమ్మ (75) ప్రతిరోజు లాగే ఇంట్లో పడుకొని ఉండగా అర్ధరాత్రి ఆమె కుడి కాలు మధ్య వేలికి పాము కాటు వేసింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా వారు ఆమెను ఆటోలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఊట్ల దత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రామానికి చెందిన వంకాయల ఓజయ్యకు చెందిన ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రోజులాగే సోమవారం బావి పరిసరాలలో గడ్డి మేస్తుండగా విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై మరణించింది. సుమారు రూ.90 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఓజయ్య వేడుకుంటున్నాడు.

పడకేసిన పారిశుధ్యం

- అటకెక్కిన తడి-పొడి చెత్త సేకరణ
- అసైన్డ్‌భూమిలో వ్యర్థాల పారబోత
- నిరుపయోగంగా డంపుయార్డులు
- విజృంభిస్తున్న దోమలు, క్రిమికీటకాలు
- రోగాలబారిన ప్రజలు

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలవ్యాప్తంగా అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనప్పటి నుంచి సమస్యలు పేరుకుపోయాయని, ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కంది మండల కేంద్రంలో సమస్య తీవ్రంగా ఉంది.

- కంది, సిద్దిపేట అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి)



కంది శివారులోని అసైన్డ్‌భూమిలో ఆదివారం పారబోస్తున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు

గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తోంది. కందిలో దాతలు ఇచ్చిన బ్యాటరీతో నడిచే చెత్త సేకరణ రిక్షాలను మూలన పడేశారు. కనీసం మురుగు కాల్వలు పూడిక తీయించడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లి ఏడాది పైనే అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రత్యేక పాలనలో గ్రామం అపరిశుభ్రంగా మారి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌తో సేకరించిన చెత్తను గ్రామ శివారులోని అసెన్డ్ భూమిలో ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. అంతేకాకుండా, హోటళ్లు, దాబాల్లో మిగిలిన ఆహార వ్యర్థాలను డంపుయార్డు పక్కనే పారబోస్తున్నా పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆహార వ్యర్థాల బహిరంగ పారబోత

కంది-శంకర్‌పల్లి హైవే పక్కనే, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కన డంపుయార్డు ఉన్నా, ఆరుబయటే ఆహార వ్యర్థాలను పారబోస్తున్నారు. డస్ట్‌బిన్‌లపై మూతలు లేకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లకుండా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నివాసితులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇక్కడ చెత్తను నెల రోజులకు ఒకసారి తగలబెడుతుండడంతో వాయు కాలుష్యం ఏర్పడతున్నది. అసైన్డ్ భూమి పక్కనే రిజిస్ట్రేషన్ కార్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాల కూడా ఉన్నాయి. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

నిరుపయోగంగా డంపుయార్డు

నాలుగు సంవత్సరాల క్రితం దాదాపు రెండున్నర లక్షలతో నిర్మించిన డంపుయార్డు ఇప్పుడు నిరుపయోగంగా మారింది. గ్రామంలో సేకరించిన తడి,పొడి చెత్తతో ఎరువులు తయారు చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుకావడం లేదు. ఇప్పటివరకు ఒక్కరోజు కూడా చెత్తను ఉపయోగించి ఎరువును తయారు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం డంపుయార్డు చుట్టూ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి వీధి కుక్కలకు అడ్డాగా మారింది.



కందిలో మూలకు పడిన చెత్త సేకరణ రిక్షాలు



సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో డ్రైనేజీ దుస్థితి

ప్రత్యేక పాలన అస్తవ్యస్తం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైన నాటి నుంచి ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. సమస్యలపై ఎవరికి చెప్పాలో కూడా తెలియని స్థితి నెలకొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని, గ్రామానికి ఒక మండల స్థాయి అధికారిని ప్రత్యేక పాలన అధికారులుగా నియమించారు. వీరు నెలకు మూడుసార్లు గ్రామాన్ని సందర్శించి స్థానిక అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పరిపాలనపై సమీక్షలు నిర్వహించాల్సి ఉండగా, అది ఎక్కడా అమలుకావడం లేదు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. గ్రామ పంచాయతీ స్థాయి అధికారులపై ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పనుల ఒత్తిడి కారణంగా వారు గ్రామాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రత్యేక పాలన యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన జిల్లా పంచాయతీ శాఖ అధికారులు ఇతర పనులలో నిమగ్నమై ప్రజలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఫసల్‌వాది గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపుయార్డు

ప్రాణం ఆగం.. పంటలు నాశనం

సంగారెడ్డి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులో సంగారెడ్డి మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన డంపు యార్డు వల్ల గ్రామంలో ఉండలేని దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల క్రితం పచ్చని పంట పొలాలతో రైతులు, ఆహ్లాదకర వాతావరణంలో ఫసల్‌వాది గ్రామం ఉండేదని, ఇప్పుడు డంపింగ్ యార్డుతో నిత్యం దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని పరిసరాల ప్రజలు మండిపడుతున్నారు. వర్షాలకు ఈ వ్యర్థాలు తడిసి ముద్దయి అందులోని నుంచి వస్తున్న నీరు పొలాలకు చేరి పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దుర్వాసనతో వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నామని వాపోతున్నారు. వృద్ధుల్లో తలనొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని తెలిపారు. డంపు యార్డుని ఇక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త చెదారాన్ని వేరు చేసి రీ సైక్లింగ్ చేస్తామని చెబుతున్నా ఇక్కడ మాత్రం ఎలాంటి రీ సైక్లింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి : గ్రామస్థులు

డంపు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. డంపుయార్డును ఇక్కడి నుంచి తరలించాలని, లేకపోతే ఎప్పటికప్పుడు రీ సైక్లింగ్ చేపట్టాలన్నారు. దుర్వాసనను అరికట్టేందుకు పచ్చదనం పెంపొందించాలని, ముఖ్యంగా చెత్త నిర్వహణకు శాస్త్రీయ విధానాలు తీసుకురావాలని కోరుతున్నారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యమందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవన్నీ అధికారులు అమలు చేయని పక్షంలో ఇక్కడి నుంచి డంపుయార్డు తరలించేవరకూ పోరాడుతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

ప్రాథమిక అంశాలపై పట్టుతో విజయం

- సెయింట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి



గౌరవ అతిథిని సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

పటాన్‌చెరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక అంశాలపై మంచి అవగాహన ఏర్పరచుకుని, వాటిపై పట్టు సాధించడం విజయానికి తొలి మెట్టు అని సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ బీ.వి.ఆర్. మోహన్ రెడ్డి అభివర్ణించారు. 'ఇంజనీరింగ్ ఒక మెరుగైన భవిష్యత్తు : ఆవిష్కరణ, బాధ్యత, ఉద్దేశం' అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ తొలి ఏడాది బీటెక్ విద్యార్థులను ఉద్దేశించి ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. విజయానికి ఆరు సూత్రాలున్నాయన్నారు. అవి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడం, ఆసక్తిగా ఉండడం, అర్థవంతమైన స్నేహాలను నిర్మించుకోవడం, నిర్భయంగా ప్రయోగాలు చేయడం, మెంటార్ల నుంచి మార్గదర్శనం పొందడం, ప్రపంచ పరిణామాల గురించి తెలుసుకోవడం అని పేర్కొన్నారు. సాంకేతికత వేగవంతం అవుతోందని, తనను తాను విస్తరించుకుంటూ సర్వవ్యాప్తి చెందుతోందని, ఇది భవిష్యత్తును రూపొందించుకోవడానికి విద్యార్థులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తోందని చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి డాక్టర్ మోహన్ రెడ్డిని సత్కరించగా, గీతం తొలిఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ త్రినాథరావు ఆయనకు సహకరించారు.

వరదరాజపూర్ పురాతన ఆలయంలో కేసీఆర్ సతీమణి పూజలు



వరదరాజపూర్ ఆలయంలో శోభమ్మ

మర్కుక్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం వరదరాజాపూర్ గ్రామంలో ఉన్న పురాతన వరదరాజస్వామి వారి ఆలయంలో సోమవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి సమీపంలోనే ఈ ఆలయం ఉంటుంది. గతంలో ఆలయ పునర్నిర్మాణానికి కేసీఆర్ రూ. 10కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో కొంతమేరకు ఆలయ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. పూర్తి స్థాయిలో పనులు జరగాల్సి ఉంది. ఇటీవల జరిగిన ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ప్రత్యేకంగా గోదాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం గోదాదేవి జన్మ నక్షత్రం కావడంతో కేసీఆర్ సతీమణి ఆలయానికి వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నాగుల పంచమికి సర్వం సిద్ధం

సిద్దిపేట కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం నాగుల పంచమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద ఉన్న పాములపుట్ట, శ్రీనివాస్ నగర్‌తో పాటుగా పలుచోట్ల, ఆలయాల వద్ద ఉన్న పుట్టల వద్ద మహిళలు పాలు పోసేందుకు తరలిరానున్నారు. గాడిచర్లపల్లిలో కొలువైన కోటి పడగల సంతాన నాగదేవతను దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపకులు కంకణాల (ఇటుక) దశరథం స్వామి ఆధ్వర్యంలో కోటిపడగల సంతాన నాగదేవతకు ప్రతి ఏటా శ్రావణమాసం నాగుల పంచమి సందర్భంగా నాగమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ జాతరకు సిద్దిపేట జిల్లాతో పాటు హైదరాబాద్, సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, అదిలాబాద్ జిల్లాల నుంచి, అలాగే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి బోనాల సమర్పణ, పాలాభిషేకం, కుంకుమార్చన, అఖండ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయంలో కొలువై ఉన్న నాగలోక రక్షకుడైన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు.



కోటి పడగల సంతాన నాగదేవత



పెద్దకంజర్ల గ్రామంలో వివరాలు సేకరించిన అధికారులు

ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్ర బృందం ఆరా

పటాన్‌చెరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. మహిళా సంఘాలకు రుణాలు, ఉపాధి హామీ పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పింఛన్ల మంజూరు వంటి అంశాలపై ప్రత్యక్ష పరిశీలన చేశారు. ఎంతమందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని గ్రామ కార్యదర్శి అనితను కేంద్ర అధికారి సృజనరెడ్డి అడిగి తెలుసుకున్నారు. 13 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 200 మందికి పింఛన్లు, ఉపాధి హామీ పథకంలో 130 మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని కార్యదర్శి వివరించారు. 36 మహిళా సంఘాలకు ఒక్కో సంఘానికి రూ.15లక్షల చొప్పున రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, ఏఈ సంపత్, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థలమున్నా.. భవనం లేదు..

- అద్దె భవనంలో శివ్వంపేట పోస్టాఫీస్

శివ్వంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు సొంత భవనం లేకపోవడంతో 30 ఏళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో పోస్టాఫీస్ నిర్వహిస్తుండంతో పత్రాలు భద్ర పరిచేందుకు వీలు లేకుండా పోయింది. పోస్టాఫీస్ కోసం ఉద్దేశించిన స్థలం ఖాళీగా ఉన్నప్పటికీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఖాతాదారులకు, ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో 37 గ్రామ పంచాయతీలు, పలు తండాలు ఉన్నాయి. వీటిన్నిటికీ ఈ పోస్టాఫీసే దిక్కు. ఇటీవల మెదక్ పర్యటనకు వచ్చిన ఎంపీ రఘునందన్‌రావు పోస్టాఫీస్ భవన నిర్మాణం కోసం ఖాళీ స్థలం ఉన్నా.. అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని స్థానిక బీజేపీ నాయకుడు వినోద్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు సొంత భవనంతో పాటు.. ఇక్కడ సబ్ పోస్టాఫీస్ మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న పోస్ట్ ఆఫీస్

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

- ఒక రోజులో రెండు డివిజన్ బెంచీలపై 100కుపైగా కేసులు

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు అనుమానాస్పద మృతి చెందితే, పోలీసులు రోడ్డుప్రమాదంగా కేసు నమోదు చేశారంటూ ఓ తల్లి ఫిర్యాదు. ఆస్తి తగాదాలలో సొంత చెల్లెళ్లే అన్నను పొట్టన పెట్టుకున్నారంటూ మృతుడి భార్య ఆవేదన. అర్ధాంతరంగా ఉద్యోగంలో నుంచి తనను తొలగించారని ఓ యువకుడి రోదన. ఇలా ఒకటా, రెండా... భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వేదికగా సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1 లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ - 1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్-2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోని పరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్ని కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవిగుప్తా, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్‌తో పాటు పలువురు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, జిల్లా పోలీసు అధికారులు పలు కేసుల నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు.

బస్సుల కోసం విద్యార్థుల ధర్నా



కౌడిపల్లిలోని జాతీయ రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

కౌడిపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బస్సులు రాకపోవడంతో నిత్యం 6 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా నాయకులు రాజేందర్ ఆధ్వర్యంలో వారు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, మండల పరిధిలోని వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెల్దుర్తి మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులు లింగంపల్లి, కొట్టాల గ్రామాల మీదుగా నడిచి వస్తుంటారని అన్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదవాలంటే కౌడిపల్లికి రావాలన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో బాల్య వివాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. చిలప్‌చెడ్ మండలంలో శిలంపల్లి, సోమక్కపేట్, అంతారం తో పాటు తాండాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ చదవడానికి బస్సులు లేవని, దీంతో ఆటోలలో రావడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇదే విషయంపై ఫోన్‌లో బీజేపీ నాయకులు మెదక్ ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. వెంటనే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. డీఎం సానుకూలంగా స్పందించడంతో ధర్నా విరమించారు.



మళ్లీ కొత్త ఓటరు జాబితా..!

- గ్రామం యూనిట్‌గా రూపకల్పన
- ఇప్పటికే మండల యూనిట్ పూర్తి
- ఎంపీడీవోల లాగిన్ నుంచి టీ-పోల్ యాప్‌లో అప్‌లోడ్

మెదక్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి వీలుగా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ఇప్పుడు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని కొత్త ఓటర్ల జాబితాను తయారు చేయనున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ఓటర్ల జాబితా రూపొందించిన అధికారులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుల వారీగా గ్రామస్థాయిలో జాబితాను సిద్ధం చేస్తున్నారు.

కుటుంబ ఓట్లు ఒకే వార్డులో

గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు వార్డుల్లో ఉండటంతో సమస్యలు తలెత్తాయి. ఈసారి ఆ సమస్యను నివారించడానికి, కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే వార్డులో ఉండేలా జాబితాను రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. ఇది ఓటర్లకు సౌలభ్యం కల్పించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియలో గందరగోళాన్ని తగ్గిస్తుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ జాబితా తయారీ బాధ్యతను పర్యవేక్షిస్తారు.



ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైన కార్యదర్శులు, సిబ్బంది

మండలం నుంచి గ్రామ స్థాయికి

గత ఫిబ్రవరిలో, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పంచాయతీరాజ్ శాఖ మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఓటర్ల జాబితాను తయారు చేసింది. ఆయా గ్రామాల్లో వార్డుల వారీగా రూపొందించిన జాబితాలను ఎంపీడీవోలకు అందజేశారు. ఎంపీడీవోలు తమ లాగిన్ ద్వారా ఈ జాబితాను 'టీ-పోల్' యాప్‌లో అప్‌లోడ్ చేశారు. తాజాగా, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, వార్డుల వారీగా మరింత కచ్చితమైన జాబితాను తయారు చేయాలని ఆదేశాలు అందాయి. ఈ జాబితాను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిద్ధం చేసి, ఎంపీడీవోల ద్వారా డీపీవోకు సమర్పిస్తారు. ఈ జాబితాను ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

మెదక్ జిల్లాలోని 492 గ్రామ పంచాయతీల్లో 5.24 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన వారి పేర్లను చేర్చడంతో పాటు, మరణించిన వారి పేర్లను తొలగించే ప్రక్రియ కూడా జరుగుతుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుంది. ఈ మార్పులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, గ్రామ స్థాయిలో కచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధం కానుంది.

ఓటర్ల జాబితా సిద్ధమవుతోంది: యాదయ్య, డీపీవో మెదక్

పంచాయతీ ఓటర్ల జాబితా కొత్తగా తయారు చేయాలని ఆదేశాలు వచ్చాయి. వార్డుల వారీగా సిద్ధం చేయాలని సూచించింది. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాం. కార్యదర్శులు పనిలో నిమగ్నమయ్యారు. వార్డులోని ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా శ్రద్ధ వహిస్తున్నాం.

జిల్లా వివరాలు..

మొత్తం మండలాలు	21
గ్రామ పంచాయతీలు	492
పోలింగ్ కేంద్రాలు	4220
వార్డుల సంఖ్య	4220
ఎంపీటీసీలు	190
జడ్పీటీసీలు	21
మొత్తం ఓటర్లు	5.24.471
మహిళ ఓటర్లు	2,72,143
పురుష ఓటర్లు	2,52,319
ఇతర ఓటర్లు	9

న్యూస్ బాక్స్

జాతీయ రహదారిపై సీసీ కెమెరాల ఏర్పాటు

మనోహరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక ఆధారంగా హైవేలపై ఇబ్బందుల్లేని ప్రయాణం కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌తో ఎమర్జెన్సీ సేవల నుంచి టోల్ చార్జీల దాకా 10రకాల సేవలు అందించనున్నారు. జాతీయ రహదారి బోయినపల్లి నుంచి నాగపూర్ వరకు 44వ జాతీయ రహదారి తెలంగాణ పరిధిలోకి వస్తుంది. దీంతో ప్రతీ కిలోమీటర్‌కు 1 సీసీ కెమెరాను చొప్పున సుమారు 250 కిలోమీటర్ల పొడవునా 250 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ వారు తెలిపారు. ఈ క్రమంలో మండలం దండుపల్లి వద్ద జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది సీసీ కెమెరాల కోసం గుంతలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

విద్యార్థుల్లో పఠన శక్తి పెంచాలి

● రాష్ట్ర పరిశీలకురాలు క్రాంతికుమారి

మనోహరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాళ్లకల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రంథాలయం ఎఫ్ఎల్ఎమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశీలకురాలు క్రాంతికుమారి హాజరై మాట్లాడారు. స్నేహ పూర్వక గ్రంథాలయాల ఏర్పాటు వల్ల విద్యార్థుల్లో పఠనా నైపుణ్యం, భాషాభివృద్ధి చెందుతాన్నారు. ఉపాధ్యాయులు నర్సింగం, ఏంఈవో మల్లేషం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పారాబాయిల్డ్ రైస్‌మిల్‌తో దుర్వాసన

హవేళిఘణపూర్, జులై 28,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజరాజేశ్వర పారాబాయిల్డ్ రైస్ మిల్లు నుంచి బూడిద, దుర్వాసన సమీప ఉన్న ఇళ్లలో పడుతుందని బాధితులు మహమ్మద్ పాషా, సుభాష్, వెంకటి తదితరులు సోమవారం పేర్కొన్నారు. నిత్యం ఇలాగే జరుగుతుందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడ్డారు. ఈ విషయాన్ని రైస్‌మిల్ యజమాని దృష్టికి తీసుకురాగా, ఏం చేసుకుంటారో చేసుకోండి అని బెదిరింపులకు దిగుతున్నాడన్నారు.

సామూహిక భవనం ప్రారంభం

రామచంద్రాపురం టౌన్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఫంక్షన్‌హాలు అద్దెలు పేదలకు భారంగా మారడంతో, సామూహిక భవనాల్లో ఉచితంగా జరుపుకోవడానికి వీలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి పోచమ్మ ఆలయ ప్రాంగణంలో రూ.1.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన సామూహికభవనాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేష్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు.

బీడీఎల్ సీఐగా విజయకృష్ణ

పటాన్‌చెరు జూలై 28 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలం బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ చార్మినార్ జోన్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సంగారెడ్డి స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న సీహెచ్ విజయకృష్ణ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

రేషన్‌కార్డుల పంపిణీకి సన్నాహాలు

పటాన్‌చెరు జూలై 28 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్ కార్డులు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారిలో 2,096 మందికి మాత్రమే అర్హత ఉందని వివరించారు. మంగళవారం జీఎంఆర్ ఫంక్షన్‌హాలులో కార్డుల పంపిణీ చేయనున్నామని వివరించారు.

గిరిజన సంక్షేమ హాస్టల్‌కు నిధుల మంజూరు హర్షణీయం

నర్సాపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నర్సాపూర్ మండలం నాగులపల్లి బంజార నగర్‌లో గిరిజన సంక్షేమ వసతిగృహం నిర్మాణానికి 3.50కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. దీని వల్ల ఈ ప్రాంత గిరిజన విద్యార్థులకు ఎంతో మేలు కల్గుతుందన్నారు. నిధులు మంజూరు చేసినందుకు మోదీ, మంత్రి ధర్మేందర్, ఎంపీ రఘునందన్‌రావుల చిత్రపటాలకు నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమణ, మాజీ కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, సురేష్, యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

'సిగాచీ' బాధితులకు అండగా బీఆర్ఎస్

పటాన్‌చెరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : సిగాచీ పరిశ్రమ బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. సిగాచి బాధితులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టరేట్ తరళి వెళ్తున్న మాజీమంత్రి హరీశ్‌రావుకు శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు బాధితులతో మాట్లాడి వారిని తీసుకుని సంగారెడ్డికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్, పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డిలు మాట్లాడుతూ పరిశ్రమలో పేలుడుకు గల కారణాలను గానీ, మరణించిన వారి సంఖ్య, గాయపడిన వారి వివరాలు తెలియజేయడంలో అటు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందనన్నారు

చెరువు కాదిది.. రహదారే



ఆలయం వైపు నుంచి రహదారిపైకి వస్తున్న మురుగునీరు



రామచంద్రాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ సర్కిల్ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు చెరువును తలపిస్తున్నది. ఇది మూడు గ్రామాల రోడ్లు కలిసే కూడలి ప్రాంతం. ఇందులో తెల్లాపూర్ నుంచి కొల్లూరు వెళ్లే రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్, కొల్లూరు నుంచి తెల్లాపూర్ వెళ్లే రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్, టీఎస్ఐఐసీ రహదారి, గ్రామ రహదారులు ఒకేచోట కలుస్తాయి. గతంలో నాలుగు రోడ్లు కలిసే ప్రాంతాన్ని సర్కిల్‌గా, ట్రాఫిక్ ఐలాండ్‌గా అభివృద్ధి చేయాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పలు దఫాలు విజ్ఞప్తి చేసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. రోడ్డులోని గుంతల్లో మట్టి వేసి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచి భారీవాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ ప్రాంతం మరింత అధ్వానంగా మారింది. ప్రయాణికులు ఎప్పుడు ఎం జరుగుతుందోనన్న ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడే నూతనంగా ఏర్పాటు చేసిన ఓ డ్రైనేజీ నిరంతరం పొంగుతూనే ఉంటుంది. ఫలితంగా ఇక్కడ గుంతలు ఏర్పడి దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఆర్అండ్‌బీ, టీఎస్ఐఐసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి





ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లలో వేర్వేరుగా నిర్వహించిన ప్రజావాణిలో వారు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.

సంగారెడ్డిలో 54 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 54 అర్జీలు అందాయి. వచ్చిన అర్జీల్లో కొన్ని ముఖ్యమైనవి ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ ఫిర్యాదు చేశారు. రామచంద్రాపురంలో రైల్వేపట్టాల పక్కన నివాసం ఉంటున్న మొత్తం 218 మంది కుటుంబాల వారికి పునరావాసం కల్పించాలని కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్‌లు, భూసమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మెదక్‌లో 120 ఫిర్యాదులు

మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 120 అర్జీలు అందాయి. ఇందులో భూసమస్యలు 50, ఇళ్లకు సంబంధించినవి 18, పింఛన్ 15, ఇతర సమస్యలకు సంబంధించినవి 37 ఉన్నాయి. దరఖాస్తులను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 18 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 18 ఫిర్యాదు వచ్చినట్లు ఎస్పీ మహేందర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు

నర్సాపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు ఒకరోజు జైలు శిక్ష విధించింది. సోమవారం ఎస్ఐ లింగం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఇటీవల మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన రహీం అనే వ్యక్తిని నర్సాపూర్ జూనియర్ కోర్టులో సివిల్ జడ్జి హేమలత ఎదుట హాజరు పరచగా విచారణ అనంతరం ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఈ మేరకు అతడిని సంగారెడ్డి జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

నర్సాపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించి పీఎస్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా పోలీసులను ఎటువంటి భయం లేకుండా సంప్రదించాలన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కల్హేర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కల్హేర్, సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలాల మీదుగా 161వ జాతీయ రహదారిపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కల్హేర్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, భారత జాతీయ రహదారుల ప్రాధికారికసంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పర్యవేక్షకులు మొయినుద్దీన్ హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లిలో సోమవారం ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణించవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

సైబర్ నేరాలపై...

నిజాంపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. మండలంలోని కల్వకుంట గ్రామ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీలపై, సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాధురి దేవి, ఉపాధ్యాయులు, ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● **వెల్దుర్తి:** గ్రామాల్లో ఉన్న ప్రతీ కల్లు దుకాణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వెల్దుర్తి ఎస్ఐ రాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన కల్లు దుకాణ యజమానులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కల్లు దుకాణాల యజమానులు తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

కంకర టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



బ్యాతోల్‌లో కంకర టిప్పర్లకు వాహనాలు అడ్డుపెట్టి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

కంది, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంద మండలంలోని బ్యాతోల్‌లో కంకర టిప్పర్ల రాకపోకలతో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. బ్యాతోల్ నుంచి లక్డారం వెళ్లే దారిలో దాదాపు రెండు కిలోమీటర్ల మేర రహదారి అంతా గుంతమయంగా మారింది. దీంతో ఆ గ్రామంలోకి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. సోమవారం బ్యాతోల్ మాజీ సర్పంచ్ మన్నె శ్రీశైలం ఆధ్వర్యంలో గ్రామస్థులు మన్నె మహేష్, గొల్ల మల్లేశ్ యాదవ్, బి.కేశవులు, బి.చంద్రయ్య, జే.సామాగౌడ్, సీహెచ్.అశోక్‌గౌడ్‌లు తమ ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి కంకర టిప్పర్ల అడ్డుకున్నారు. అనంతరం అక్కడ దెబ్బతిన్న గుంతలను అధికారులు వెంటనే బాగు చేయించాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ గ్రామం మొత్తం మైనింగ్ క్రషర్లు ఉండడంతో వాటిలోని కంకరను సరఫరా చేసే టిప్పర్లు లక్డారం వైపు రోజుకు 200 వందల వరకు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. దీంతో రోడ్డంతా గుంతలు ఏర్పాడ్డాయన్నారు. ఆ గుంతల్లో వర్షం నీరు నిండి మరింత అధ్వానంగా తయారయ్యాయని తెలిపారు. గ్రామంలో కనీసం స్కూలు బస్సులు రావాలంటే జంకే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ల యజమానులకు ఈ విషయాన్ని చెప్పినా వారు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే తమ గ్రామ రోడ్లను బాగు చేయించాలని కోరారు. ఆందోళనలో బ్యాతోల్ మాజీ సర్పంచ్ మన్నె శ్రీశైలం, గ్రామస్థులు మన్నె మహేష్, గొల్ల మల్లేశ్ యాదవ్, బి.కేశవులు, బి.చంద్రయ్య, జే.సామాగౌడ్, సీహెచ్. అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు



గుమ్మడిదల ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గుమ్మడిదల/నాగల్‌గిద్ద, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో ఎరువుల అక్రమ నిల్వలను ఉంచితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి కె. శివప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని ఎరువులు షాపులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు ముఖ్యంగా యూరియా నిల్వలు, అమ్మకాలు, స్టాక్ బోర్డులు పరిశీలించారు. అక్రమంగా ఎరువులు నిల్వ చేసినా, సరియైన రసీదులు లేకుండా అమ్మినా వారిపై చర్యలు తీసుంటామని తెలిపారు. ప్రస్తుతం గుమ్మడిదల మండలం లో 190 మెట్రిక్ టన్నులు యూరియా, 200 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాగల్‌గిద్దలో సోమవారం ఖేడ్ వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్, ఏవో ప్రవీణ్‌చారితో కలిసి ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, మందులు నిర్దేశించిన ధరకే అమ్మాలన్నారు. అనంతరం నాగల్‌గిద్ద శివారులో పత్తి, పెసర, పంటలను పరిశీలించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, అధికారులు

జహీరాబాద్,జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త డా.రమేష్, తదితరులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లచ్చునాయక్‌తండా తదితర గ్రామాల్లో డీడీఎస్-కేవీకే, మల్లారెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ పనిఅనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడుతూ.. భూసారపరీక్ష, పంటమార్పిడి విధానం, విత్తనఎంపిక, ఎరువులు వాడే విధానం, తదితరా అంశాలపై గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ముఖ్యంగ సేంద్రీయ పద్ధతుల్లోనే వ్యవసాయం చేయాలని సూచించారు. అధికంగ రసాయన ఎరువులను వినియోగిస్తే వ్యవసాయభూములు భూసారాన్ని కోల్పోతాయన్నారు. ముందుగ వారంత గ్రామంలో వ్యవసాయం, ఎరువుల వినియోగం తదితరాలపై చిత్రప్రదర్శన చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజల సందడి



గుమ్మడిదల: వీరభద్రస్వామి ఆలయంలో లక్షపత్రి పూజా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాలకమండలి



వెల్దుర్తి: శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మడిదల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొన్నది. గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్న గూడెం గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి సోమవారం సందర్భంగా ఆలయంలో చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్త ఆధ్వర్యంలో లక్షపత్రి అర్చన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య ఘనంగా ప్రారంభించారు. నెల రోజులు పాటు ఈ లక్షపత్రి పూజా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

● పుల్‌కల్: చౌటకూర్ మండలకేంద్రంలో వెలసిన శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయంలో వర్షాలు కురువాలంటూ శివుడికి జలాభిషేకం చేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ఐదు బిందెల చొప్పున ప్రజలు మంచినీటిని తీసుకువెళ్లి శివుడికి అభిషేకం చేశారు గ్రామ శివారులోని కోమటి చెరువు వద్ద పూజలు నిర్వహించారు.

● నారాయణఖేడ్: పట్టణంలోని పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. మంగల్‌పేట సంగమేశ్వర ఆలయం ఆవరణలో వామన్‌రాజ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కీర్తనలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయంలో మారుతి మహారాజ్, శ్రీరామ కథామృతాన్ని భక్తులకు వినిపించారు. కల్పనా ఆంజనేయస్వామి ఆలయంలో నవనాథ పురాణం, కాశీనాథ్ ఆలయంలో భస్మహారతి నిర్వహించారు.

●వట్‌పల్లి: మండలంలోని.. మరవెల్లి గ్రామంలో.. వీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ ఆధ్వర్యంలో సామూహిక ఇష్టలింగార్చన నిర్వహించారు. కాశీపీఠాధిపతి జగద్గురు చంద్రశేఖర శివాచార్య ప్రసంగిస్తూ శ్రావణమాస విశిష్టతను భక్తులకు తెలియజెప్పారు.

● వెల్దుర్తి: మండలంలోని బస్వాపూర్ శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● పెద్దశంకరంపేట: మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పేట శివారులోని భ్రమరాంబ మల్లికార్జున్ స్వామి ఆలయంలో, గొట్టి ముక్కులలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యలను అధిగమించడానికే చట్టాలు



బూచనెల్లిలో బాలికల గురుకులంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి కవితాదేవి

జహీరాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో సమస్యలను అధిగమించడానికి చట్టాలు దోహదపడుతాయని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్‌జడ్జి కవితాదేవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బూచనెల్లి గ్రామశివారులో గల బాలికల మైనారిటీ గురుకుల పాఠశాల లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతున్న క్రమంలో లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని చెప్పారు. విద్యార్థులకు చదువుతోపాటు చట్టాలపై అవగాహన అత్యవసరమన్నారు. వివిధరకాల చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, లీగల్‌సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, వసతిగృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిని కలిసిన యూనియన్ నాయకులు



సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మలను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు, వైద్యాధికారులు

సంగారెడ్డి అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డా.నాగనిర్మలను పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(ఐఎన్‌టీయూసీ-3194)నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వైద్య ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు గుండయ్య, కార్యదర్శి ఈర్న భాస్కర్, నాయకులు తదితరులు ఉన్నారు. వీరితో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, కార్యాలయ ఉద్యోగులు సైతం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

మునిపల్లి పీహెచ్‌సీలో వెయిటింగ్‌హాల్ ప్రారంభం

మునిపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు కూర్చొనేందుకు వెయింటింగ్ హాల్ లేక ఇబ్బంది పడేవారు. వెయిటింగ్ హాల్ ఏర్పాటు కోసం డెక్కన్ టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ (సీఎస్ఆర్) అధికారులను కోరగా టోల్‌ప్లాజా సహకారంతో నిర్మించారు. ఈ మేరకు సోమవారం వెయిటింగ్ హాల్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డెక్కన్ టోల్‌వేస్ రీజినల్ హెడ్ వినీష్ కుమార్, ప్రాజెక్టు హెడ్ రాజేష్ విచారే, పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి, వైద్య పీహెచ్ఎస్ చంద్రభాను, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్‌లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

మెదక్, కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రం టీఎన్జీవో భవన్‌లో నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలానికి 293, పట్టణానికి సంబంధించిన 757 రేషన్ కార్డుల పంపిణీ జరిగిందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారులకు బీమా సౌకర్యం

రేగోడు జూలై 28 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులకు తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం ఉందని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రాజేష్ తెలిపారు. సోమవారం రేగోడు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కులను పంపిణీ చేశారు. బ్యాంకులో బీమా చేసిన 6 మంది వివిధ కారణాలతో మృతి చెందడంతో ఒక్కొక్కరికి రూ.2 లక్షలు నామిని అకౌంట్‌లో జమ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీఐ సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ అజయ్ కుమార్, మహేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, బ్యాంకు సిబ్బంది రాకేష్, రాజకుమార్, భూమయ్య ఉన్నారు.

ఉత్కంఠ!

(3వ పేజీ తరువాయి)

గ్రామపంచాయతీ ఎన్నికలా..? ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలా..? అనే విషయంపై అస్పష్టత నెలకొన్నది. కాగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నదనే సంకేతాలు వస్తున్నాయి.

ఆ మండలాలకు తొలిసారిగా..

2019వ సంవత్సరంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో పోల్చితే సంగారెడ్డి జిల్లాలో నిజాంపేట, చౌటకూర్ మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. తొలిసారి ఇక్కడ మండల పరిషత్‌లతోపాటు జడ్పీటీసీలు ప్రాతినిథ్యం వహించనున్నారు. అదే విధంగా మెదక్ జిల్లాలో క్రితంసారి 20 మండలాలు ఉండగా మాసాయిపేటతో కలిపి ప్రస్తుతం మండల పరిషత్‌ల సంఖ్య 21కి చేరింది. ఈ మూడు మండలాల పేరిట తొలిసారి ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు కొలువు దీరనున్నారు. మండల పరిషత్‌ల జాబితాలో ఇవి చోటు దక్కించుకున్నాయి. దీనికి సంబంధించిన గెజిట్ కూడా విడుదలైంది. ఇప్పటికే ఈ మండలాల్లో తహసీల్దార్‌తోపాటు ఇతర కార్యాలయాలు ఉన్నాయి. ఎన్నికల తర్వాత ఎంపీపీ కార్యాలయాలు కూడా ఏర్పాటు కానున్నాయి.

జడ్పీ చైర్మన్ సీట్లపై..

సంగారెడ్డి జిల్లాకు తొలి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన మంజూశ్రీ జనరల్ మహిళా కోటాలో బాధ్యతలు స్వీకరించారు. ఇక మెదక్ జిల్లాలో బీసీ మహిళా రిజర్వేషన్‌లో హేమలత జడ్పీ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు కొనసాగారు. అయితే, ఈసారి రిజర్వేషన్ ఎలా ఉంటుందోననే ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పలువురు ఆశావహులు జనరల్ కోటాపై నమ్మకం పెట్టుకొని తమ మండలాల్లో దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైనవారు, టికెట్ దక్కనివారు ఈ రేసులో ఉన్నారు. అన్ని మండలాల్లో ప్రొటోకాల్‌తో పాటు సహాయ మంత్రి హోదా కలిగినవారు ఈ పదవిపై కన్నేశారు. ఆర్థికంగా కోట్లు కూడబెట్టిన పలువురు జడ్పీ చైర్మన్ సీటులో కూర్చోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. అయితే పార్టీలపరంగా మ్యాజిక్ నంబర్ గెల్చుకున్న పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడికే ఈ అవకాశం ఉంటుంది. ఆయా మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లపై ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

సిగాచి బాధితుల రోదన

(3వ పేజీ తరువాయి)

జరిగిన సమయంలో బాధిత కుటుంబీకులందరికీ పరిహారం వెంటనే ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అటు యాజమాన్యం దగ్గరకు రానివ్వడం లేదని వాపోయారు.

చెప్పులరిగేలా తిరుగుతున్నాం



సిగాచి ప్రమాదంలో నా కొడుకు జస్టిన్ దుర్మరణం చెందాడు. కంపెనీ పరిహారం కింద రూ.15లక్షల చెక్కు అందజేశారు. ప్రభుత్వం కోటి రూపాయలు ఇస్తామని చెప్పింది. కానీ ఇప్పటివరకు రూ.15లక్షల మాత్రమే ఇచ్చారు. మిగతా డబ్బు ఇవ్వాలని కంపెనీ చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

-రాందాస్, మృతుడు జస్టిన్ తండ్రి, పటాన్‌చెరు

పరిహారమే ఇవ్వలేదు



సిగాచి ప్రమాదంలో నా భర్త మృతి చెందగా నాకు పరిహారం అందలేదు. అందరికీ పదిలక్షలు ఇచ్చారు. కానీ నాకు రూపాయి ఇవ్వలేదు. ప్రస్తుతం ఇంటి అద్దె చెల్లించేందుకు, తినడానికి తిండి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం.

- సంజూదేవి, మృతుడు చౌకత్‌కల్ భార్య, మధ్యప్రదేశ్